# అట్టహాసంగా గణనాథుడి శోభాయాత్ర

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు
- ఆకట్టుకున్న కోలాటం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** ప్రొద్దుటూరు నగర శ్రీ గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గణనాథుల శోభాయాత్ర పురవీధుల్లో అట్టహాసంగా సాగింది. రామేశ్వరం ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్రలో వివిధ వినాయక ఉత్సవ కమిటీల గణనాథుల విగ్రహాలు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. భక్తులు మంగళవాయిద్యాలు, కోలాటం, చెక్కభజనలు, కర్రసాము విన్యాసాలతో వైభవంగా వేడుకను నిర్వహించారు. దారి వెంబడి వివిధ ప్రాంతాలలోని 15పైగా వినాయక విగ్రహాలు ఈ యాత్రలో పాల్గొన్నాయి. రామేశ్వరం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర వసంతపేట, గాంధీరోడ్డు, టీబీరోడ్డు, రాజీవ్ సర్కిల్, పుట్టపర్తి సర్కిల్, మైదుకూరు రోడ్డు మీదుగా బైపాస్ రోడ్డు చేరుకుని కామనూరు కుందూ నదిలో ఏకదంతుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎడిపై పాఠశాల వద్ద కేంద్ర కమిటీ, శివోహం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శోభాయాత్ర కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కమిటీ ఉపాధ్యక్షుడు రమేష్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, నాగమునిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రెడ్డికుమార్, కమిటీ సభ్యులు, శివాలయం గణపతి మహోత్సవ కమిటీ అధ్యక్షులు మార్రెళ్ల మల్లిఖార్జునరావు, కార్యదర్శి అట్ల నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం, గోనా ప్రభాకర్‌రెడ్డి, చంద్రగుప్త కమిటీ సభ్యులు, వివిధ గణపతి మహోత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : శోభోయాత్రలో గణనాథులు

### వైభవంగా నిమజ్జనం

**రాజుపాళెం :** మండలంలోని పలు గ్రామాలతో పాటు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సోమవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. స్వాములకు ప్రత్యేక పూజల తర్వాత డప్పు వాయిద్యాలతో గణనాథున్ని తీసుకెళ్లారు. యువకులు, పెద్దలు, మహిళలు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేసుకుంటూ ఎంతో కుందూనదిలో ఆనందంగా నిమజ్జనం చేశారు.

### శభాష్.. పోలీస్

నాలుగైదు రోజులుగా మండలంలోని వెల్లాల, కూలూరు, టంగుటూరు, వెలవలి గ్రామాల పరిధిలోని కుందూనది వద్ద వినాయకుడిని నిమజ్జనాలు జోరుగా జరుగుతున్నాయి. అయితే ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడింది. ఈ క్రమంలో నిమజ్జనం వద్ద ఎటువంటి పొరపాట్లు జరగకుండా రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించాడు. ఆ వర్షంలో ఎస్ఐ తడిచి ముద్దయ్యాడు. ఆ వర్షంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటరమణను అక్కడకు వచ్చిన భక్తులంతా శభాష్.. పోలీస్ అంటూ కొనియాడారు.


రాజుపాళెం: వెల్లాల వద్ద కుందూనదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


ప్రొద్దుటూరు కల్చరల్ : ఆపరేషన్ సింధూర్ విజయగణపతి


ప్రొద్దుటూరు కల్చరల్ : కోలాటం ఆడుతున్న మహిళలు

## రూ.1.50 లక్షలు పలికిన వెండి కలశం


వెండి కలశం చెంబుతో నల్లదేసి జంగమయ్య యాదవ్ కుటుంబ సభ్యులు

**ప్రొద్దుటూరు :** మండలంలోని కొత్తపల్లె పంచాయతీ వివేకానంద కాలనీలో శ్రీవరసిద్ధి వినాయకుని మండపం వద్ద సోమవారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో వెండి కలశం చెంబును వైఎస్సార్‌సీపీ మండల బీసీ ఉపాధ్యక్షుడు నల్లదేసి జంగమయ్య యాదవ్ రూ.1.50 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ వారు జంగమయ్య యాదవ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

### ఘనంగా కొత్తూరు గణనాథుడి నిమజ్జనం

**బ్రహ్మంగారిమఠం :** మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం సాగర్ రోడ్డులోని కొత్తూరు గ్రామంలో సోమవారం సాయంత్రం గణనాథుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఐదు రోజులు అన్నదానాలు, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా కేరళ డప్పు వాయిద్యాలతో కొత్తూరు, మఠం పురవీధులలో వినాయకుడిని ఊరేగించారు.

## క్లుప్తంగా

### గురప్పస్వామి ఆలయంలో దుకాణాలు వేలం

**పోరుమామిళ్ల :** మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థాన ఆవరణలో అంగళ్లు పెట్టుకొనుటకు, వస్తువులు సేకరించుకొనుటకు ఈ నెల 4న ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ తలనీలాలు సేకరించుకొనుటకు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. టెంకాయలు అమ్ముకొనుటకు, అంగళ్లు పెట్టుకొనుటకు, వంటపాత్రలు, షామియానాలు బాడుగకు ఇచ్చుకొనుటకు, కూల్ డ్రింక్ షాపు పెట్టుకొనుటకు ఒక్కోదానికి రూ. 25 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలన్నారు. కొబ్బరి చిప్పలు సేకరించుకొనుటకు రూ.10 వేలు, పూలదండలు, నిమ్మకాయలు అమ్ముకొనుటకు రూ. 5 వేలు డిపాజిట్ చేసి పాటలో పాల్గొనాలని వివరించారు.

### ఉద్యోగులకు డీఏలు విడుదల చేయాలి

**గోపవరం :** ఉద్యోగులకు బకాయిలు ఉన్న నాలుగు కరువు భత్యాలలో కనీసం రెండింటిని వెంటనే విడుదల చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బద్వేలులో నిర్వహించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి వెంటనే ఓటీఎస్‌ను ప్రకటించాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శం కావాలన్నారు. పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించి ఉద్యోగులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవిశంకర్, ప్రభాకర్, రవి, రమణ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

### న్యాయవాదికి సన్మానం

**ప్రొద్దుటూరు :** స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డి న్యాయవాద వృత్తిలో 46 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మురుకూటి సూర్యనారాయణరెడ్డి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ట్రస్ట చైర్మన్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ న్యాయవాది కొండారెడ్డి పేదలకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించారన్నారు. న్యాయవాదులు సుబ్బారెడ్డి, సుమంత్, విశ్రాంత ఉద్యోగి సుధాకర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తైక్వాండోలో ప్రతిభ


తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లోని జవహర్ బాల కేంద్రం విద్యార్థులు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభకనబరిచారు. అండర్–10 బాలికల విభాగంలో కుందన్ సాయి, రామసుస్మిత, అండన్–14 బాలుర విభాగంలో హేమంత్, కార్తవార్జున్, పునీత్‌రెడ్డి బంగారు పతకాలు సాధించారు. యువరామ్‌రెడ్డి, ఆరీఫ్, తేజశంకర్‌రెడ్డి వెండి పతకాలు, జూనియర్ బాలికల విభాగంలో సుకీర్తనరెడ్డి, యోగిత, జాహ్నవి కాంస్య పతకాలు సాధించారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో గౌరీష్ కుమార్, దక్షీస్‌కుమార్, సిద్ధార్థరెడ్డి, జోగేశ్వర్, ఆదిల్, వేదాభిరామ్ రెడ్డి, జీవన్‌రెడ్డి, దివీస్, అజీమ్‌లు కాంస్య పతకాలు సాధించారు. వీరిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ మునీశ్వర్, ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ తదితరులు అభినందించారు.

### వార్డుల్లో పర్యటించిన కమిషనర్

**ప్రొద్దుటూరు :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పర్యటించారు. శివాలయం సెంటర్‌లో ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ తొలగింపజేశారు. అర్చన హాల్ వద్ద ఉన్న మడూరు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, గాంధీ రోడ్డు, రామేశ్వరం రోడ్డులలో డివైడర్లలో ఎక్కువగా పెరిగిన చెట్లను కటింగ్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రొద్దుటూరు ఛానల్–1 కాలువ ఎన్‌క్రోచ్‌మెంట్ చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు.

## అభివృద్ధిని విస్మరించిన కూటమి ప్రభుత్వం

**ప్రొద్దుటూరు :** కూటమి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా విమర్శించారు. ఆయన సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనుల కోసం మున్సిపాలిటీలో కనీసం ఒక్క చోటైనా టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అల్పాహార విందులో ఏర్పాటుకు అధికంగా బిల్లులు వసూలు చేశారని ఆరోపించారు. కమిషనర్‌ను ప్రశ్నించామే తప్ప ఆయన అవినీతిపరుడని ఆరోపించలేదని తెలిపారు. మున్సిపాలిటీలోని ఏ సెక్షన్‌లో ఏమి అవినీతి జరుగుతుందో త్వరలో బయటపెడతామని ప్రకటించారు. తమ ప్రభుత్వ హయాంలో ఉచితంగా ఎగ్జిబిషన్ ప్రవేశం కల్పించామని, ఈ కారణంగా కాంట్రాక్టర్ బలరామిరెడ్డి ప్రభుత్వానికి జీఎస్టీ మాత్రం చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టర్ చలపతి అధికంగా ఎంట్రన్స్ ఫీజు వసూలు చేసినా చర్యలు తీసుకోలేకపోయారని మండిపడ్డారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి గతంలో ఎగ్జిబిషన్ వేలం పాటలో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చేశారన్నారు. మార్కెట్ నిర్వహణకు వేలం పాట పెడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు గుర్రం ప్రకాశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా


సోమవారం పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

## రోడ్డు విస్తరణలో కోల్పోయే మంచినీటి పథకాలు గుర్తింపు

**చాపాడు :** ప్రొద్దుటూరు – మైదుకూరు మధ్యలోని జాతీయ ప్రధాన రహదారి రోడ్డు విస్తరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు విస్తరణలో వివిధ పంచాయతీలలో కోల్పోయే మంచినీటి పథకాలు, ఇతర ప్రభుత్వ అవసరమైన వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ రోడ్డు వెంట ఉన్న గ్రామాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న జాతీయ ప్రధాన రహదారిని ఆరు మీటర్ల మేరకూ విస్తరిస్తున్నారన్నారు. ఈ విస్తరణలో పల్లవోలు, చాపాడు, పుల్లారెడ్డినగర్, విశ్వనాథపురం గ్రామాల వద్ద మంచినీటి పథకాలకు సంబంధించిన బోర్లు, పైపులైన్ లు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రోడ్డు నుంచి 6 మీటర్ల పరిధిలో ఉండే పైపులైన్‌లను గుర్తించి అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పుల్లారెడ్డినగర్ వద్ద బోరు, పైపులైన్ తొలగించి నూతనంగా ఏర్పాటు చేసేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


పుల్లారెడ్డినగర్ వద్ద వద్ద పైపులైన్‌కు సంబంధించి కొలతలు వేస్తున్న అధికారులు

## వెంకటసుబ్బమ్మ సేవలు అభినందనీయం

**రాజుపాళెం :** ఉపాధ్యాయ వృత్తిలో అందరి మన్ననలను పొందిన గుద్దేటి వెంకటసుబ్బమ్మ సేవలు అభినందనీయమని ఎంఈఓలు ప్రసాద్, రామస్వామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో గుద్దేటి వెంకటసుబ్బమ్మ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ పదవీవిరమణ పొందారు. ఆమెకు సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు అధ్యక్షతన సన్మానం చేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 42 ఏళ్లు వెంకటసుబ్బమ్మ పనిచేశారని తెలిపారు. ఆమె పాఠశాల ప్రహరీ నిర్మాణానికి, స్కౌట్ బాయ్స్‌కు డ్రమ్ములు, మైక్ సెట్, పదో తరగతిలో మంచి ప్రతిభకనబరిచిన విద్యార్థికి ప్రతి ఏడాది ఆర్థిక సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం వెంకటసుబ్బమ్మ దంపతులను శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వెంకటసుబ్బమ్మ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

**ప్రొద్దుటూరు :** దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి సోమవారం ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌ను చిన్న, పెద్ద కార్డులు ఇవ్వాల్సి ఉండగా పెద్ద కార్డు మాత్రమే ఇస్తున్నారన్నారు. పెద్ద, చిన్న కార్డులు ఉంటేనే సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసేందుకు అర్హులుగా గుర్తింపబడుతామన్నారు. అధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్‌ను చిన్న, పెద్ద రెండు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బదిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకిశోర్, కమ్మగిరి రాముడు, వెంకటసుబ్బయ్య, హనుమంతు, బాషా, నారాయణ, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

### సక్రమ కొలతలతో రోడ్డు పనులు చేయండి

**పోరుమామిళ్ల :** పట్టణ ప్రధాన రహదారి పనులు కాంట్రాక్టర్, అధికారులు సక్రమ కొలతలతో చేయాలని మానవ హక్కుల సంఘం కార్యదర్శి ఫణిరావు కోరారు. సాయిబాబా మందిరం వద్ద సోమవారం తొలగించిన ఆక్రమణలు సక్రమంగా లేవన్నారు. రికార్డులో పేర్కొన్న విధంగా పట్టణంలో ఒకే కొలతలతో ఆక్రమణలు తొలగించి, రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఒక చోట ఎక్కువ, మరో చోట తక్కువ కొలతలతో పనులు చేయడం మంచిది కాదన్నారు. పట్టణ ప్రధాన రోడ్డు అధ్వానంగా, నాసిరకంగా, ఎగుడు దిగుడుగా ఉంటే అందరూ విమర్శిస్తారన్నారు.

### వాటర్‌ప్లాంట్ తొలగించాలి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** నివాస గృహాల మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఇబ్బందికరంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని కోరుతూ భగత్‌సింగ్ కాలనీ ప్రజలు తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందచేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి అనుమతులు లేకుండా కసిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి వాటర్ ప్యూరిఫై మిషన్ పెట్టి పగలు రాత్రి తేడా లేకుండా శబ్ద కాలుష్యంలో అసౌకర్యం కలిగిస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సుధాకర్ మాదిగ, ఆ ప్రాంత వాసులు మహబూబ్‌బాష, లక్ష్మీదేవి, బీబీలు తహసీల్దార్‌కు తెలిపారు. ఈ విషయమై మే నెలలో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే ప్లాంట్ తొలగించాలని గోపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదని తెలిపారు. అనేక పర్యాయా లు ఈ విషయమై ఆయనను సంప్రదించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దస్తగిరి, గౌసియా సుల్తానా, శివకుమార్ పాల్గొన్నారు.

### అన్నదానం

**చాపాడు :** ముఖ్య పుణ్యక్షేత్రమైన మండంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవ కార్యక్రమం ఘనంగా చేపట్టారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

**ఖాజీపేట :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కన్నెలవాగు చెరువును ఆయన పరిశీలించారు. తెలుగు గంగ నీటిని కాలువ ద్వారా చెరువుకు వచ్చే నీటిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నెల వాగు చెరువు పూర్తిగా వర్షం ద్వారా నిండుతుందని అన్నారు. కానీ వర్షలు లేని కారణంగా చెరువుకు నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే తెలుగు గంగ కాలువ నుంచి సబ్ కాలువ ఎర్పాటు చేసి నీటిని చెరువుకు నింపుతున్నాం అన్నారు. వరుసగా రెండవ సంవత్సరం నీటితో చెరువును నింపడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కొండపేట కేసీకెనాల్ డిస్టిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు రెడ్యం రవీంద్రారెడ్డి , స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ముంపు బాధితుల ఓట్ల తొలగింపులో అత్యుత్సాహం

**గోపవరం :** మండలంలోని సోమశిల వెనుకజలాల కింద ముంపునకు గురైన సూరేపల్లి, వడ్డెపాళెం దళితవాడలకు చెందిన ముంపు బాధితుల ఓట్ల తొలగింపులో అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమ్యూనికేషన్ కటాఫ్ కింద 2005, 2006లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సూరేపల్లి దళితవాడకు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, అయితే ముంపునకు గురైన దళితవాడకు సంబంధించి పునరావాసం కల్పించాలని అప్పట్లోనే జీవో నెం.98ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్ మరణానంతరం అప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన ప్రభుత్వాలు దళితవాడ ముంపు బాధితులకు పునరావాసం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి దళిత వాడ ప్రజలు స్థానికంగా నివాసం ఉన్నారని పేర్కొన్నారు. ముంపు బాధితులకు పునరావాసం కల్పిస్తే దళితవాడను ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే 2009లో సూరేపల్లె, వడ్డిపాళెం గ్రామాలకు నష్టపరిహారం చెల్లించారని, ఇంకా భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, బోనస్ కూడా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, అవి వచ్చేంత వరకు ఇళ్లు ఖాళీ చేయబోమని కరాఖండిగా అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. అయితే బతుకు దెరువు కోసం ఎక్కడికెక్కడో వెళ్లి కుటుంబాలు పోషించుకుంటున్నారని ఇలాంటి పరస్థితిల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన కొందరు సూరేపల్లి ముంపు బాధితుల ఓట్లు తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓట్ల తొలగింపు కోసం నోటీసులు పంపడం ఎంతమేరకు సబబని పేర్కొన్నారు.

## డ్వాక్రా సంఘాలు ఎన్నుకున్నా టీడీపీ నాయకుల అడ్డగింపు

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని పలుగురాళ్ళపల్లెలో డ్వాక్రా సంఘం సభ్యుల ఎన్నికలల్లో 14 ఓట్లు వచ్చిన నన్ను యానిమేటర్‌గా ఎంపిక చేయకుండా టీడీపీ నాయకులు అడ్డుతగులుతున్నారని శోభారాణి సోమవారం బి.మఠంలో విలేకరులతో వేదనతో తెలిపింది. ఆమె మాట్లాడుతూ పలుగురాళ్ళపల్లె 1 యానిమేటర్‌గా ఉన్న ఎర్రంపల్లె బేబీరాణి భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె సరిగా విధులకు రాకపోవడంతో వెలుగు అధికారులు 50 రోజుల క్రితం మరొకరికి అవకాశం ఇచ్చేందుకు నోటీసు ఇచ్చారు. ఇందుకోసం ముగ్గురు పోటీ పడగా 25 డ్వాక్రా సంఘం సభ్యులకు ఓటింగ్ ఏర్పాటు చేశారు. నాకు 14 ఓట్లు వచ్చాయి, మిగిలిన ఇద్దరికి 3 ఓట్లు వేశారు. అంజలి అనే ఆమెకు ఒక ఓటు వేశారు. వెలుగు అధికారులు శోభారాణికి యానిమేటర్ బాధ్యతలు అప్పచెప్పనున్నట్లు నియామక పత్రం కూడా ఇచ్చారు. వెలుగు లాగిన్‌లోకూడా పేరు చేర్చారు. ఇంతలో స్థానిక టీడీపీ నాయకులు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డితో అంజలికి యానిమేటర్ ఇప్పించాలని పట్టు పడడంతో ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ ద్వారా లేటర్ తీసుకువచ్చారు. ఏపీఎం ఓబులేసు నాకు బాధ్యతలు అప్పచెప్పకుండా వెనుక వేస్తున్నాడు. సీసీని సంప్రదించినా ఏపీఎంపై చెబుతున్నాడు. నియామక పత్రం ఆధారంగా నేను బద్వేల్ కోర్టును ఆశ్రయించాను. కోర్టు కలెక్టర్ చాంబర్ అధికారులకు నోటీస్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. నాకు అవకాశం ఇవ్వక పోతే కలెక్టర్‌కు ఏపీఎం ఓబులేసు, సీసీ నారామణలపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

**ప్రొద్దుటూరు :** కడప హరిత హోటల్‌లో ఈనెల 8, 9, 10 తేదీలలో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, రాజస్థాన్, తమిళనాడు తదితర 22 రాష్ట్రాల ప్రతినిధులతోపాటు, కేరళ ప్రభుత్వ చైర్‌పర్సన్ మాజీ ఎంపీ విజయరాఘవన్, ప్రస్తుత రాష్ట్ర సభ సభ్యుడు డాక్టర్ శివదాసన్, బెంగల్, త్రిపుర మాజీ మంత్రులు హాజరవుతారన్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికుల సమస్యలపై జరిగే చర్చలు సఫలం కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఊహాజనిత అభివృద్ధి పేరుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

## ప్రజ్ఞాశాలి పుట్టపర్తి నారాయణాచార్యులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** పుట్టపర్తి నారాయణాచార్యులు 14 భాషల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి అని పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పుట్టపర్తి నారాయణాచార్యుల 35వ వర్ధంతి సందర్భంగా స్థానిక శివాలయం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు తన 12వ ఏటే పెనుగొండ లక్ష్మి అనే కావ్యాన్ని రచించారని తెలిపారు. ప్రపంచంలో ఏ కవికి జరగని విధంగా పుట్టపర్తి తాను రచించిన కావ్యమే తనకు పాఠ్యాంశంగా రావడం అపురూపమని తెలిపారు. పుట్టపర్తి సాహితీ పీఠం ఉపాధ్యక్షుడు సాదు గోపాలకృష్ణ, ఎస్వీ అకాడమి మాజీ డైరెక్టర్ డాక్టర్ రామాంజనేయులరెడ్డి, తవ్వా సురేష్ రెడ్డి, కొత్తపల్లి శీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పుట్టపర్తి నారాయణాచార్యుల విగ్రహానికి పూలమాల వేస్తున్న జింకా సుబ్రహ్మణ్యం తదితరులు